నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 24 ఫిబ్రవరి 2025
MONDAY, FEBRUARY 24, 2025

## కారు, రెండు బైకులు ఢీ : ముగ్గురికి గాయాలు

వినాయకనగర్, ఫిబ్రవరి 23 : నిజామాబాద్ నగరంలో శనివారం రాత్రి జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలో ఓ కారును డ్రైవర్ అతివేగంగా నడుపుకొంటూ వచ్చాడు. అదే సమయంలో అటువైపుగా వచ్చిన రెండు బైకులు, కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తితో పాటు బైక్‌లపై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.

## రైలు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 23 : నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ సీహెచ్.సాగర్ ఇచ్చిన సమాచారం ప్రకారం.. అర్సపల్లి రైల్వే గేటుకు కొద్దిదూరంలో జాన్కంపేట్ రైల్వేస్టేషన్ మధ్య సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ మహిళ గుర్తుతెలియని రైలు ప్రమాదంలో మరణించినట్లు తెపారు. మహిళ వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతురాలి సంబంధీకులు రైల్వే ఎస్సై – 87126 58591 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## దొంగకు దేహశుద్ధి

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 23 : జిల్లాకేంద్రంలో ఆదివారం సాయంత్రం ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతున్న దొంగను పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. నగరంలోని శివాజీనగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లోకి చొరబడిన దుండగుడు సుమారు 15 తులాల విలువ చేసే వెండి వస్తువులతో పాటు కొంత నగదు దొంగిలించి పారిపోతుండగా ఇంట్లో వారు గుర్తించారు. అనంతరం స్థానికుల సహాయంతో సదరు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం రెండో టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## కుమ్మర శాలివాహన సంఘ భవనం ప్రారంభం



సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న తుగ్గలి నారాయణ

కంఠేశ్వర్, ఫిబ్రవరి 23 : జిల్లా కేంద్రంలోని 5వ డివిజన్ పరిధిలో కుమ్మర శాలివాహన సంఘ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుమ్మర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో కుమ్మర శాలివాహన కులస్తులకు తగిన గుర్తింపు లభించడం లేదని, కుమ్మర కులస్తులను గుర్తించి వారిని రాజకీయంగా ప్రోత్సహించాలని కోరారు. జిల్లా కేంద్రంలో నూతన భవనాన్ని నిర్మించుకున్న 4వ తర్ప కుమ్మర శాలివాహన సంఘ సభ్యులను అభినందించారు. సంఘ భవన నిర్మాణానికి కృషి చేసిన వారికి జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ అంకమ్మ రావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నార్లపురం రవీందర్, గౌరవ అధ్యక్షుడు గుమ్మడిపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి విజ్జగిరి రవికుమార్ శెట్టి, కోశాధికారి రాజవరపు ఏడుకొండలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



రుద్రూర్ జడ్పీహెచ్ఎస్ 1981–82 బ్యాచ్ విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న కోటగిరి జడ్పీహెచ్ఎస్ 2001–02 బ్యాచ్ విద్యార్థులు

కోటగిరి/ కమ్మర్‌పల్లి (మోర్తాడ్), ఫిబ్రవరి 23 : జిల్లాలోని పలు పాఠశాలల్లోని పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం జరుపుకొన్నారు. చాలా ఏండ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని ఉద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు పలుకరించుకొని, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబీకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరు వేసుకొని రోజంతా సందడి చేశారు. వారికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను కార్యక్రమాలకు ఆహ్వానించి, ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

కోటగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, వరకుమారి, ఆశాజ్యోతి, రమేశ్‌తోపాటు ప్రస్తుత హెచ్‌ఎం శ్రీనివాసరావును సన్మానించారు. పూర్వ విద్యార్థులు శ్వేత, మహేశ్వరి, జ్యోతి, లలిత, సవిత, స్రవంతి, అశోక్, దిగంబర్, మల్లేశ్, శంకర్, సాగర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదువుకున్న 1998–99లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయసమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు.

### విజేత కళాశాలలో గురువులకు పూర్వ విద్యార్థుల సన్మానం

బోధన్, ఫిబ్రవరి 23 : బోధన్ పట్టణంలోని విజేత జూనియర్ కళాశాలలో ఆ కళాశాల ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు, ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వై.రమణారెడ్డి – అంజనాదేవి దంపతులతోపాటు ప్రిన్సిపాల్ భూలక్ష్మీరెడ్డి, ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, విశిష్ట అతిథిగా రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ లక్ష్మీరెడ్డి పాల్గొని ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వై.రమణారెడ్డి, ప్రిన్సిపాల్ భూలక్ష్మీరెడ్డి, విజేత సాయి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సుప్రజారెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిశోర్, ట్రస్మా, వివిధ ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు మిద్దె రాజు, హరికృష్ణ, కృష్ణమోహన్, సురేశ్, ఐఆర్ చక్రవర్తి, రాజేందర్, మనోజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

### 43 ఏండ్ల తర్వాత..

రుద్రూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1981–82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.రవికిరణ్, మండల విద్యాధికారి కె.శ్రీనివాస్, రాధ, పూర్వ విద్యార్థులు ప్రభాకర్, శానం శంకర్, నూత్‌పల్లి గణేశ్, జల్లాపురం సాయిలు తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లోని విజేత కళాశాలలో కరస్పాండెంట్ రమణారెడ్డి – అంజనాదేవి దంపతులు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు



చౌట్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1998–99 బ్యాచ్ విద్యార్థులు





పురస్కారాలు అందుకుంటున్న కాందాళై రాజగోపాలాచారి, బోనాల నటకృష్ణ

ఇందల్వాయి గ్రామ పురోహితుడు, శ్రీ సీతా రామ చంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు కందాళై రాజగోపాలాచారికి, నల్లవెల్లి గ్రామ పురోహితుడు, లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు బోనాల నటకృష్ణ ఆదివారం పురస్కారాలు అందుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రాముడి ఆలయ సన్నిధిలో ఇంటర్నేషనల్ ఆస్ట్రో వైదిక ఫెడరేషన్ ద్వారా జ్యోతిష్యులుగా సేవలందించిందినందుకు ఆస్ట్రో గ్లోరీ అవార్డు –2025 పురస్కారాన్ని అందజేసి, సత్కరించారు.

– ఇందల్వాయి, ఫిబ్రవరి 23

## ఎన్నికల ప్రచారానికి మాత్రమే వస్తారా?

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి23: ఎన్నికల ప్రచారానికి మాత్రమే జిల్లాకు వస్తుంటారా అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎన్నికల కోడ్ అనంతరం జిల్లాకు రావాలని కోరారు. సీఎం సొంత జిల్లాకు కేటాయించిన నిధుల్లో నిజామాబాద్ జిల్లాకు అందులో 50 శాతం నిధులైనా కేటాయించాలని కోరుతున్నట్లు తెలిపారు.

## మాక్లూర్‌లో చికెన్, ఎగ్ మేళా..



చికెన్ మేళాలో పాల్గొన్న ప్రజలు

మాక్లూర్, ఫిబ్రవరి23: మండల కేంద్రంలో వెన్‌కాబ్ సౌజన్యంతో సనా చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం చికెన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేళాకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల్లో అంతు చిక్కని వ్యాధితో కోళ్లు చనిపోతుండగా చికెన్ కొనుగోళ్లు తగ్గిపోయిన విషయం తెలిసిందే. సనా సెంటర్ వారు. రెండు వేల గుడ్లు, 200 కేజీల చికెన్ వంట చేసి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. బర్డ్‌ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మేళాను నిర్వహించినట్లు సనా చికెన్ సెంటర్ నిర్వాహకుడు ఇర్ఫాన్ తెలిపారు.

## ప్రశాంతంగా టీజీ సెట్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 23 : మండలంలోని ధర్మారం(బీ)లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన టీజీ సెట్ ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ తెలిపారు. 2025–26 సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగిందని, 596 మంది విద్యార్థులకు 582 మంది విద్యార్థులు హాజరైనట్లు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ మాధవీలత తెలిపారు.

## ఘనంగా బోనాల పండుగ



బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 23 : నగరంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న ఎల్లమ్మ ఆలయ దశమ వార్షికోత్సవం సందర్భంగా ఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల జాతర నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య మహిళలు బోనాలను ఊరేగించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు.

## విద్యా రంగానికి నిధులు కేటాయించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి23: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆర్మూర్ మండల కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్థిక కారణాలు చూపుతూ డీఏలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల జీపీఎఫ్, సరెండర్ లీవ్, మెడికల్ బిల్లులు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు.

## నవాబ్ లిఫ్ట్ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



కొనసాగుతున్న నీటి విడుదల

వేల్పూర్, ఫిబ్రవరి 23: మండలంలోని వివిధ గ్రామాలకు నవాబ్ లిఫ్ట్ ద్వారా వారం రోజుల నుంచి నీటి విడుదల కొనసాగుతున్నది. వంతుల ప్రకారం ఆయా గ్రామాల్లోని చెరువులకు కాలువల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. కాలువలకు ఎవరూ గండి కొట్టకుండా చూసుకునే బాధ్యత రైతులపై ఉందని అధికారులు తెలిపారు.

# అసత్య ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం

ఏర్గట్ల, ఫిబ్రవరి 23: కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి తమ పార్టీ నాయకుడిపై ఫేస్‌బుక్ వేదికగా అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నాడని, ఆయన పరిస్థితి విచిత్రంగా ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణనందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఆరు వేలకు ట్రాక్టర్ ఇసుక విక్రయించి అవినీతికి పాల్పడ్డారని అసత్య ఆరోపణలు చేసిన నాయకులు ఈ విషయంపై ప్రజాక్షేత్రంలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో ఎవరికైనా ఇసుక అవసరం ఉంటే తహసీల్దార్, ఆర్డీవోల ద్వారా వేబిల్ తెచ్చుకొని న్యాయంగా తీసుకెళ్లేవారని అన్నారు. కానీ.. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు 34 వే బిల్స్ తెచ్చుకొని 300 ట్రాక్టర్ల ఇసుకను జేసీబీలతో తోడి అక్రమంగా తరలించినట్లు ప్రజలే ఆరోపిస్తున్నారని, దీనికి సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ట్రాక్టర్లే నడవాలని వేరే వారివి నడవవద్దని హుకుం జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఇకముందు బీఆర్ఎస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు జక్కని మధుసూదన్, సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్, మాజీ కో–అప్షన్ మెంబర్ అస్రాఫ్, పార్టీ నాయకులు లక్కం నర్సయ్య, జైనుద్దీన్, రొక్కెడ మోహన్, నాగిరెడ్డి రాజేందర్, గుండ్ల గంగాధర్, మాజీ సర్పంచ్ భీమనాతి భానుప్రసాద్, అనుక్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలుడి వైద్య ఖర్చులకు ఎమ్మెల్సీ కవిత సాయం



ఎమ్మెల్సీ కవిత అందజేసిన ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబీకులకు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కృష్ణ, నాయకులు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 23: బోధన్ పట్టణంలోని 12వ వార్డుకు చెందిన శ్రీకాంత్ విజయ దంపతుల మూడు నెలల బాలుడు కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా, నిజామాబాద్ మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేశారు. బాలుడికి శస్త్ర చికిత్స చేయించేందుకు ఆర్థికంగా సాయం కావాల్సి ఉన్నందున, స్థానిక బీఆర్ఎస్ యువ నాయకుడు రామకృష్ణను బాలుని తండ్రి సంప్రదించగా, ఆయన ఈ విషయాన్ని ఎమ్మెల్సీకి వివరించారు. కాగా, సదరు బాలుడి చికిత్స కోసం ఎమ్మెల్సీ కవిత పంపిన రూ.25వేల ఆర్థిక సాయాన్ని పెరిక రామకృష్ణ బాలుడి తండ్రికి అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్సీకి బాలుడి తల్లిదండ్రులు శ్రీకాంత్ విజయ కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యను ఎమ్మెల్సీకి వివరించి, సాయానికి సహకరించిన పెరిక రామకృష్ణకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

## రెండు మొరం ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న మొరం ట్రాక్టర్లతో పోలీసులు

మోర్తాడ్, ఫిబ్రవరి 23: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం తిమ్మాపూర్ రోడ్డు వద్ద ఉన్న వరదకాలువ కట్ట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. బండారు ప్రభాకర్, ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తరచూ కమ్మర్‌పల్లిలో సెలవు రోజుల్లో అక్రమంగా మొరాన్ని తరలిస్తున్నారు. ఇదే విషయం ఆర్ఐ శరత్‌కుమార్‌కు తెలియడంతో వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించినట్లు తెలిసింది.

## ఒకరి అదృశ్యం

ఎడపల్లి, ఫిబ్రవరి 23: ఎడపల్లి మండలం బాపూనగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం అదృశ్యమయ్యాడు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...బాపూనగర్ గ్రామానికి చెందిన కట్కురి రాములు(40) ఈనెల 22న మధ్యాహ్నం బయటికి వెళ్లివస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. తిరిగి రాలేదు. కాఫీ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడని పేర్కొనారు. భార్య నాగజ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు

## ఇంటికి చేరిన తల్లీపిల్లలు



తల్లీపిల్లలను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 23: తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన చెవిటి రేవతి, కుమారుడు రిత్విక్, కూతురు రియాన్షి క్షేమంగా ఇంటికి చేరినట్లు స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీన రేవతి కుటుంబ కలహాలతో భర్తతో గొడవ పడింది. 20వ తేదీన పిల్లలతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. బంధువుల ఇంటికి వెళ్లిన రేవతి పిల్లలతో కలిసి తిరిగి క్షేమంగా ఆదివారం వచ్చింది. రేవతి పిల్లలను భర్తకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

## ముగిసిన పీఎం శ్రీ విహారయాత్రలు

రామారెడ్డి, ఫిబ్రవరి 23 : పీఎం శ్రీ పథకం రెండో విడుతలో భాగంగా ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలకు చెందిన 5,6,7వ తరగతి విద్యార్థులు శనివారం హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్‌కు విహారయాత్రకు వెళ్లినట్లు ప్రిన్సిపాల్ శివరాం ఆదివారం తెలిపారు. ఇంతటితో ఈ పథకంలో భాగంగా విహారయాత్రలు ముగిశాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా ట్రాఫిక్

- నడిరోడ్లపై వాహనాలు, తోపుడు బండ్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



భీమ్‌గల్‌లో ఆదివారం ఓ షాపు ఎదుట రోడ్డుపై పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

భీమ్‌గల్, ఫిబ్రవరి 23: పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్నది. పట్టణానికి రావాలంటేనే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాలకు వచ్చే వారు నడిరోడ్డుపై వాహనాలను పార్క్ చేస్తున్నారు. కొందరు వ్యాపారులు తోపుడుబండ్లను రోడ్డుపు ఉంచి సరుకులు విక్రయిస్తున్నారు. రోజూ వివిధ పనుల నిమిత్తం భీమ్‌గల్‌కు వచ్చే వారు పార్కింగ్‌కు స్థలం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం వార సంత ఉండడంతో సమస్య మరింత తీవ్రం అవుతున్నది. సంతలో చోరీలు కూడా ఎక్కువయ్యాయని స్థానికులు అంటున్నారు. కూరగాయలకు వచ్చే మహిళల నుంచి నగదు, సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలను దొంగిస్తున్నారు. వారు తేరుకునే లోపే అక్కడి నుంచి పారిపోతున్నారు. గతంలో వారసంత రోజు పోలీసులు మఫ్టీలో తిరుగుతూ దొంగలను పట్టుకునే వారు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. స్టేషన్‌లో సిబ్బంది సరిపడా ఉన్నప్పటికీ సోమవారం సంతవైపు పోలీసులు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్యతోపాటు సంతలో దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# నిరుపయోగంగా దోబీఘాట్

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 23: బోధన్ పట్టణ శివారులోని చెక్కి చెరువులో నిర్మించిన దోబీఘాట్ నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో రజకులు బట్టలు ఉతికేందుకు దీనిని నిర్మించారు. ఈ చెరువులో బోధన్ పట్టణానికి చెందిన పలు కాలనీల మురికి నీరు చేరుతున్నది. బెలాల్ చెరువు ద్వారా నీటిని నింపాల్సి ఉండగా, ఈ చెరువు నింపేందుకు వచ్చే కాలువ అధ్వానంగా మారింది. గంగపుత్రులు నానా అవస్థలు పడి ఈ చెరువులోకి నీటిని మళ్లించినా, మురికినీరే ఎక్కువ శాతం ఉంది. దీంతో నీరు అపరిశుభ్రంగా మారుతున్నది. దీంతో రజకులు ఇక్కడ బట్టలు ఉతకడం లేదు. దోబీఘాట్ నిరుపయోగంగా మారింది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి దోబీఘాట్‌ను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



బోధన్ పట్టణ శివారులోని చెక్కి చెరువులో నిర్మించిన దోబీఘాట్